క్లుప్తంగా

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి

భీమవరం: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, సీపీఐ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి అర్జీదారులతో వ్యక్తిగత దరఖాస్తులు కలెక్టర్‌కు అందిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. బుధవారం భీమవరం పట్టణం రెల్లికాలనీ రామాలయం వద్ద ఇళ్లు లేని పేదలతో ఇంటి స్థలాల కోసం దరఖాస్తులను పూర్తి చేయించిన సందర్భంగా మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తామని ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాంప్రసాద్, ఖాన్ భాషా, నీలాపు విశ్వనాథం, అల్లం భాస్కరరావు, పి శ్రీనివాసరావు, బి వెంకటలక్ష్మి, ఎం విజయకుమారి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 13 మంది గైర్హాజరు

కాళ్ల: మండలంలో బుధవారం నిర్వహించిన పదో తరగతి సైన్స్ పరీక్షకు 13 మంది గైర్హాజరయ్యారు. కాళ్ల హైస్కూల్లో 210 మంది, కోపల్లెలో 201 కిగాను ముగ్గురు, కలవపూడిలో 109కి గానూ ఆరుగురు, ఏలూరుపాడు జెడ్పీ హైస్కూల్లో 202 మందికి గానూ నలుగురు విద్యార్థులు చొప్పున మొత్తం 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర తెలిపారు. మండలం మొత్తం 722 మంది హాజరుకావాల్సి ఉండగా 709 మంది పరీక్ష రాసినట్లు వివరించారు.

ముస్లింలకు పవిత్ర పండుగ రంజాన్

ఆకివీడు: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ నెల ఉపవాస దీక్షతో, భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేస్తారని జిల్లా ఎస్పీ నయీం అస్మి చెప్పారు. స్థానిక ముస్లిం వీధిలోని జామియా మసీదు(చిన్న మసీదు) వద్ద బుధవారం ముస్లింలు అందించిన ఇఫ్తార్ విందులో ఎస్పీ పాల్గొన్నారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు అత్యధికంగా ఉన్న ఈ ప్రాంతంలో ప్రజలంతా ఐక్యమత్యంగా మెలగడం మతసామరస్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు ఎండీ.బిలాల్, ఆతీఫ్, అజ్మల్, ఆరీఫ్, ఎండీ.జక్కీ, ఏజాజ్, సల్పీ, సాజిద్, కిషోర్ పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

పాలకోడేరు: స్వయం ఉపాధి పథకం కింద వివిధ కార్పొరేషన్‌ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం స్థానిక. మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పాలకోడేరు ఎంపీడీఓ వి.రెడ్డియ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కొండేపూడి బ్యాంక్ పరిధిలోని వారికి ఆ రోజు ఉదయం 11 గంటలకు, కోరుకొల్లు, మైప, బ్యాంక్ పరిధిలోని వారికి మధ్యాహ్నం 2 గంటలకు, గరగపర్రు బ్యాంక్ పరిధిలోని వారికి మధ్యాహ్నం 3 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

లయన్స్ రీజియన్ చైర్మన్‌గా వీవీ కృష్ణంరాజు

ఆకివీడు: లయన్స్ రీజియన్ చైర్మన్‌గా గ్రామానికి చెందిన వేగేశ్న వెంకట కృష్ణంరాజు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన ఆకివీడు పరిధిలోని నాలుగు క్లబ్‌లకు జోన్ చైర్మన్‌గా పని చేస్తున్నారు. జూలై 1 నుంచి రీజియన్ చైర్మన్‌గా 12 క్లబ్‌ల ద్వారా సేవా కార్యక్రమాల్ని పర్యవేక్షించనున్నారు. అలాగే జోన్ చైర్మన్లుగా మోటుపల్లి శ్రీనివాసరావు, పేర్ని సుబ్రహ్మణ్యం, నడింపల్లి వెంకట మహేష్ వర్మ ఎంపికయ్యారని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు తెలిపారు.

తిరుపతిశాస్త్రికి ఘన నివాళి

ఉండి: తిరుపతి వేంకటకవుల్లో ఒకరైన దివాకర్ల తిరుపతిశాస్త్రి నిలువెత్తు విగ్రహాన్ని గ్రామంలో నెలకొల్పి ఆయనకు నిజమైన నివాళులర్పిస్తామని యండగండి ఉప సర్పంచ్ పెన్మత్స జగపతిరాజు అన్నారు. బుధవారం యండగండి గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో తిరుపతిశాస్త్రి 153వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ గొప్ప కవి ఈ గ్రామంలో జన్మించడం అందరి అదృష్టమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వేగేశ్న రామరాజు, కన్నా శివన్నారాయణ, వేగేశ్న సత్తిరాజు,దండు సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను గౌరవించాలి

వీరవాసరం: కలలు ,కళాకారులు ఎక్కడైతే గౌరవించబడతారో ఆ ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందని రాష్ట్ర మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు తెలిపారు. వీరవాసరం కళాపరిషత్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖిల భారత స్థాయి నాటక పోటీల సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటక ప్రదర్శన ద్వారా సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి ఎంతో దోహదపడతాయన్నారు. ప్రముఖ నాటక రచయిత కేకేఎల్ స్వామి ,రాజా తాతయ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటక పరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, పాల ఆంజనేయులు, అల్లు రామకృష్ణ ,గంట ముత్యాలనాయుడు, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఉచిత బస్సు రోడ్డెక్కేదెప్పుడో..?

- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి సర్కారు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం నుంచి రాని స్పష్టత
- సూపర్‌సిక్స్ పథకాలపై ఆశలు వద్దంటున్న సీఎం చంద్రబాబు



భీమవరం అర్బన్: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోల్లో సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి. ఎన్నికల ముందు మహిళలు ఎక్కడైనా ఉచితం ప్రయాణం చేయొచ్చంటూ విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. కూటమి నేతలు గద్దెనెక్కి 10నెలలు గడుస్తున్నా హామీలను పట్టించుకోవడం లేదు. ఉచిత బస్సు ప్రయాణం ఇంకెప్పుడు అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేశాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూడా అలానే చేస్తామంటూ ఎన్నికల్లో జోరుగా ప్రచారం చేపట్టింది. అయితే ఉచిత బస్సు హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఉచిత బస్సు పేరుతో మభ్యపెట్టారని స్పష్టం కావడంతో మహిళలు ఉసూరుమంటున్నారు.

స్పష్టత లేదు

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సీఎం చంద్రబాబు ఇప్పటి వరకు కనీసం స్పష్టత ఇవ్వడం లేదు. రోడ్డు రవాణాశాఖ మంత్రి మాత్రం త్వరలోనే అని చెప్పడం తప్ప.. ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం . తొలుత గత ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి అని అన్నారు. మళ్లీ మహిళలకు దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణం అని వదంతులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. దీనికితోడు ఏకంగా చంద్రబాబు సైతం సూపర్ సిక్స్ హామీలయితే ఇచ్చాము. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తుందని వ్యాఖ్యానించడం మహిళల అనుమానాలకు బలం చేకూర్చింది.

భీమవరం మండలంలో...

మండలంలో దిరుసుమర్రు, యనమదుర్రు, తాడేరు, బేతపూడి, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి, తోకతిప్ప, నాగిడిపాలెం, వెంప, బేతపూడి, తుందుర్రు, కంసాల బేతపూడి, దొంగపిండి తదితర గ్రామాలలో మహిళా ఓటర్లు ఉన్నారు. వీరంతా ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

ఇంకెప్పుడు అమలు చేస్తారు?



ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి పథకాలకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఈ పథకాలను ఇంకెప్పుడు అమలు చేస్తారో ప్రభుత్వ పెద్దలు చెప్పాలి. అధికారం కోసం ఇష్టారీతిగా హామీలివ్వడం, తర్వాత వాటిని అటకెక్కించడం సరికాదు.

కొల్లాటి రామలక్ష్మి, మహిళ, కొత్తపూసలమర్రు

కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసింది



మహిళల ఓట్లు రాబట్టేందుకు కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు, ఉచిత దీపం పథకం, ఆడబిడ్డ నిధి, తల్లికి వందన వంటి పథకాలు తీసుకవచ్చి ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం అన్నారు. ఎవరికి డబ్బులు పడ్డాయో, ఎంతమందికి పడ్డాయో తెలియదు. కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది.

పెనుమాల లావణ్య,
మహిళ, గొల్లవానితిప్ప

ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ ఫిర్యాదు

భీమవరం: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనను శారీరకంగా అనుభవించి మోసం చేశాడని ఒక యువతి ఫిర్యాదు చేసిందని వన్‌టౌన్ సీఐ ఎం. నాగరాజు తెలిపారు. భీమవరం పట్టణానికి చెందిన జి. ఉదయ్ బాధితురాలిని కొన్నేళ్లుగా ప్రేమిస్తున్నానంటూ వెంటపడి, తన ఇంజినీరింగ్ చదువు పూర్తి చేశాక ఉద్యోగం వచ్చిన వెంటనే పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. అతడిని బుధవారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండ్ విధించారన్నారు.

నలుగురు బైండోవర్

వీరవాసరం: ఎక్సైజ్ కేసుల్లో సంబంధం ఉన్న వీరవాసరం మండలానికి చెందిన నలుగురు వ్యక్తులను వీరవాసం తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేయడం జరిగిందని ఎక్సైజ్ సీఐ ఎం బలరామరాజు బుధవారం తెలిపారు. వీరవాసరానికి చెందిన మట్టా వెంకటేశ్వరరావు, పెర్కిపాలెంకు చెందిన గెడ్డం రాంబాబు, తోట రమేష్, అండలూరుకు చెందిన మల్లుల ప్రసాద్‌లను బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఒక్కొక్కరి దగ్గర నుంచి లక్ష రూపాయలు పూచికత్తు తీసుకోవడం జరిగిందన్నారు. ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాస్టర్ మరణంపై విచారణ చేపట్టాలి

ఆకివీడు: రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం పలు అనుమానాలకు తావిస్తుందని దీనిపై సమగ్ర దర్యాప్తు చేయించాలని సీబీసీఎన్‌సీ సంఘం, అనుబంధాల సంఘల అధ్యక్షులు మద్దా జ్ఞాన్‌రాజు, కార్యదర్శి గండి రాజు డిమాండ్ చేశారు. స్థానిక సీబీసీఎన్‌సీ చర్చి వద్ద బుధవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ పాస్టర్ మరణంపై సమగ్ర విచారణ చయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా సంఘాల ప్రతినిధులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రైటర్ రమణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు చొప్పల వెంకటేష్, బొండాడ యోనా, వింజమూరి మార్కు, గోడి మార్కురాజు, మద్దిరాల సామ్యేల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడు: పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం అందజేస్తున్న దృశ్య

ఉండిలో..

ఉండి: రాజమండ్రిలో అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై తమకు అనుమానాలున్నాయని న్యాయం చేయాలని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్(యుపీఎఫ్) మండల అధ్యక్ష, కార్యదర్శులు సోడదాసి పీటర్,ములపర్తి యోనాతాను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని యూపీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ల వద్ద నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగార్జునకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఏఎస్సై శ్రీనివాస్‌కు ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఈలి డేవిడ్ మార్క్, సోడదాసి దేవసహాయం , ఎన్.చంద్రబాబు, నీతిపూడి యోహాను,పి.పురుషోత్తం పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద క్రైస్తవులు ధర్నా

భీమవరం: ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ ప్రొటెక్షన్ అసోసియేషన్‌కు చెందిన పలువురు నాయకులు మాట్లాడుతూ పాస్టర్ మృతిపై నిష్పక్షపాత విచారణ చేయించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునకు వినతిపత్రం అందజేశారు.

హోటళ్లపై దాడులు

ఆకివీడు: మండలంలోనూ, పట్టణ పరిధిలో వివిధ హోటళ్లపై బుధవారం సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో వ్యాణిజ్య సిలెండర్లు వినియోగించకుండా, గృహావసర గ్యాస్ సిలెండర్ల వినియోగిస్తున్నట్లు గుర్తించి మొత్తం 18 సబ్సిడీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నాలుగు హోటళ్లపై సెక్షన్-6ఏ కేసు నమోదు చేయనున్నట్లు సివిల్ సప్లయిస్ డీటీ మహేష్ చెప్పారు.

నేడు అగ్రహారం ఉప సర్పంచ్ ఎన్నిక

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం గ్రామంలో గురువారం ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.గతంలో ఉపసర్పంచ్‌గా పనిచేసిన కడలి చినసత్యనారాయణ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో ఉసర్పంచ్ ఎన్నిక అనివార్యమైంది.ఎన్నిక ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని వార్డు సభ్యులు ఉదయం 10 గంటలకు కార్యాలయానికి చేరుకోవాల్సి తుంటుందని అధికారులు తెలిపారు. ఐదు రోజుల క్రితం వార్డు సభ్యులకు నోటీసులు అందించామని, మళ్లీ ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామని పంచాయితీ కార్యదర్శి జేవీటీ నాయుడు తెలిపారు. గ్రామ పంచాయితీలో 12 మంది వార్డు సభ్యులుండగా ఒకరు గల్ఫ్ దేశం వెళ్లడంతో 11 మంది ఎన్నికకు హాజరవుతారని తెలిపారు. అలాగే సర్పంచ్‌కు కూడా ఓటు హక్కు ఉంటుంది కనుక మొత్తం 12 ఓట్లు ఉంటాయన్నారు. వీరిలో కోరం ఏడుగురు సభ్యులు హాజరైతేనే ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి ఈవోపీఆర్డీ సీఎస్‌పీ రెడ్డి తెలిపారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కాళ్ల: స్వచ్ఛంద సంస్థలు సామాన్యులకు కంటి వైద్య సదుపాయం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని, వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రావణ్ అన్నారు. మండలంలోని బొండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం భీమవరం మానవత సంస్థ ఆధ్వర్యంలో, వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన శరీర అవయువాల్లో నేత్రాలు ప్రధానమైనవని, వాటి విషయంలో నిర్లక్ష్యం చేస్తే శాశ్వతంగా చూపుని కోల్పోతామన్నారు. ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసిన మానవత సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో 160 మంది నేత్ర పరీక్షలు చేయించుకోగా , 78 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. ఆపరేషన్లు 20 మందికి చేయిస్తున్నామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పెన్మెత్స రామ్మోహనవర్మ (పూనా రాము), బుద్ధరాజు వెంకటపతిరాజు, కార్మూరి నరసింహమూర్తి (బాబు), గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్, ఇందుకూరి ప్రసాదరాజు, చేకూరి ఝాన్సీ లక్ష్మి, అల్లు శ్రీనివాస్, కలిగొట్ల గోపాల శర్మ, వద్ది వెంకటేశ్వరరావు, పెన్మెత్స రంగరాజు తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రావణ్

ఆరోగ్య కేంద్రం పరిశీలన

కాళ్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి కిరణ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎంజేఏవై కార్డులు పంపిణీ గురించి సమీక్షించి ఎంఎల్‌హెచ్‌పీలకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.సునీల్ పాల్గొన్నారు.

యువత ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలి

భీమవరం: యువత ఉపాధి అవకాశాలు పెంపొందించుకోడానికి చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని జిల్లా పరిశ్రమల శాఖ ప్రమోషనల్ ఆఫీసర్ శ్రీపతి చెప్పారు. బుధవారం పట్టణంలోని గణేష్ ఈసీఈ కంప్యూటర్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఎన్‌ఐ-ఎంఎస్‌ఎంఈ, జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేథో సంపత్తి హక్కులు- ప్రభుత్వ పథకాలు విధి విధానాలపై అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపనకు క్రెడిట్ గ్యారంటీ లేకుండా ఇస్తున్న రుణాలు తీసుకుని పెద్ద సంఖ్యలో పరిశ్రమల స్థాపనకు నాంది పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఐ-ఎంఎస్‌ఎంఈ కో ఆర్డినేటర్స్ గణేష్, వెంకట్, గణేష్ ఈసీఈ కంప్యూటర్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ కోయ రవిచంద్ర, సుచిత్ర, కోయ రాజా తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీపతి

ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి

భీమవరం: మోటారు సైకిల్స్ ప్రమాదాల్లో ఎక్కువ శాతం తలకు గాయాల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించడం వల్ల పూర్తి రక్షణ లభిస్తుందని భీమవరం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టణంలోని వీఎస్‌కే డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్మెట్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపేటపుడు లైసెన్స్, ఇన్సూరెన్స్, వెహికల్ డాక్యుమెంట్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవింగ్ చేసే వారేగాకుండా వారికి వెహికల్ ఇచ్చిన గార్డియన్ లేదా తండ్రి కూడా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ వైవీఎస్ఎస్ మూర్తి అధ్యక్షత వహించగా ట్రాఫిక్ ఎస్‌ఐ ఎం రామకృష్ణ, విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ భవాని, ట్రాఫిక్ ఏఎస్‌ఐ దాలయ్య పాల్గొన్నారు.



హెల్మెట్‌పై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఆబోతుపై వ్యక్తి హల్‌చల్

భీమవరం: భీమవరం రెస్ట్ హౌస్ రోడ్డు కూడలిలోని ఓ ఆబోతుపై వ్యక్తి ఒకరు కూర్చొని హల్చల్ చేశాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. మద్యం మత్తులో ఆబోతుపై కూర్చోవడంతో పాటు పడుకుని ఉన్న దాని పక్కనే కూర్చొవడాన్ని సెల్‌ఫోన్లలో బంధించి సోషల్ మీడియాలో ఉంచారు.